ప్రయాణం.. ప్రమాదభరితం



ప్రమాదభరితంగా కల్వర్టు

మండలంలోని తిక్కవరప్పాడు – కంటేపల్లి మార్గంలో తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్‌పై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నిత్యం పలు గ్రామాల రైతులు, ప్రయాణికులు ఈ మార్గంపై రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ మార్గంలో నిర్మించిన కల్వర్టు శిథిలమై సగానికిపైగా కూలిపోవడంతో ద్విచక్ర వాహనాలు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి. అదుపుతప్పితే ప్రమాదం జరిగే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి కల్వర్టును నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– వెంకటాచలం

ఆగని ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు

మండల చుట్టుపక్కల గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు ఆగడం లేదు. పోలీసులు ఎంతగా నిఘా పెడుతున్నా, దొంగలు ఏదో చోట చోరీ చేస్తూనే ఉన్నారు. మండలంలోని అల్లూర్తి గ్రామ పొలాలు, నిమ్మ తోటల్లో ఇటీవల వరుసగా చోరీలు జరిగాయి. ఇదే గ్రామంలో నాలుగు రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి అందులో ఉన్న రాగి తీగను దొంగలించారు. దీంతో రైతులు నిమ్మతోటలకు నీరు పారించుకునేందుకు విద్యుత్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరులు ముఠాగా ఏర్పడి పగటి వేళ గ్రామాల్లో తిరుగుతూ రాత్రి వేళ దొంగతనాలకు పాల్పడుతున్నారు. గ్రామాలకు దూరంగా తోటలు ఉండటంతో రైతులు గుర్తించలేకపోతున్నారు. ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. కొద్ది రోజులు ఆగిన చోరీలు తిరిగి జరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు.

– పొదలకూరు



నిరుపయోగంగా బస్ షెల్టర్



బస్సు ప్రయాణమే సురక్షితమంటూ తరచూ డ్రైవ్‌లను నిర్వహించే ఆర్టీసీ.. దానికి అనుగుణంగా ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాల విషయంలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. బస్సులు ఆగే చోట షెల్టర్లు కానరావు. అవసరం లేని చోట మాత్రం వీటిని నిర్మిస్తున్నారు. మనుబోలు కోదండరామపురం తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని బస్ షెల్టర్ నిరుపయోగంగా మారింది. బస్సులు ఆగే మెయిన్ సెంటర్‌ను వదిలేసి బైపాస్ రోడ్డు పక్కన గల సర్వీస్ రోడ్డు వద్ద గతంలో నిర్మించారు. ఇక్కడ బస్సులు ఆగే వెసులుబాటు లేకపోవడంతో ఇది నిరుపయోగంగా మారింది. దీనికి తోడు గ్రామానికి దూరంగా ఉండటంతో ఒక్కరూ రావడం లేదు. కోదండరామపురంలో బస్సులు ఆగే రెండు చోట్ల షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు నానా ఇబ్బంది పడుతున్నారు. సమస్యను ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ప్రయోజనం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– మనుబోలు

క్లుప్తంగా

శివపార్వతులకు నందివాహన సేవ

విడవలూరు: మండలంలోని రామతీర్థం గ్రామంలో కొలువైన రామలింగేశ్వరుని ఆలయంలో ఉత్సవాల సందర్భంగా ఆదివారం శివపార్వతులు నందివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామస్తులు వందల సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి నందీశ్వరునికి పూలతో విశేషాలంకారణ చేసి స్వామి అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగున స్వామివారిని దర్శించుకుంటూ మొక్కులు తీర్చుకున్నారు. దండిగుంట గ్రామానికి చెందిన ఉడాలి రామకృష్ణయ్య కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ మల్లికార్జునరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ బెల్లకొండ వెంటేశ్వర్లు, చైర్మన్ అత్తిరాల సురేష్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



కోవూరు: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలిగా నియమితులైన మొయిళ్ల గౌరి, భర్త సురేష్‌రెడ్డితో కలిసి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డిని కోవూరులోని ఆయన అతిథి గృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



మనుబోలు: మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మకు ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, విశేష పూజలను అర్చకుడు ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో జరిపారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై గ్రామదేవతలను దర్శించుకొని పానకాలను నైవేద్యంగా సమర్పించారు.

బీజేపీ అభివృద్ధి పాలనపై ప్రచారం



పొదలకూరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ 11 ఏళ్ల అభివృద్ధి పాలనపై పట్టణంలో ప్రచారాన్ని పార్టీ నేతలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికురాలికి సాయం

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న పసల రమణమ్మ కుటుంబానికి తోటి కార్మికులు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఆమె భర్త రంగయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో భీమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రమణమ్మ నివాసానికి ఆదివారం వెళ్లి సాయాన్ని అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుమతి, యాలమ్మ, సుబ్బమ్మ, పోలమ్మ, శైలజ, స్వరూప, విజయమ్మ పాల్గొన్నారు.

ఆర్టీసీకి ఆటోల బెడద

- బస్టాండ్‌లో విచ్చలవిడిగా దర్శనమిస్తున్న వైనం

పొదలకూరు: ఆర్టీసీకి ఆటోల బెడద అధికంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో వీటి కారణంగా బస్సులు వెళ్లలేకపోతున్న విషయం తెలిసిందే. ఫలితంగా ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదమని తెలిసినా, ఆటోలను తప్పనిసరి పరిస్థితుల్లో ఆశ్రయిస్తున్నారు. పొదలకూరు పట్టణంలో సైతం ప్రయాణికులు వీటిని ఎక్కి జిల్లా కేంద్రం నెల్లూరు వెళ్తున్నారు. పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో ఆర్టీసీకి సంబంధించి నెల్లూరు, గూడూరు, రాపూరు, ఆత్మకూరు డిపో బస్సులు వచ్చి వెళ్తుంటాయి. పొదలకూరు నుంచి నెల్లూరుకు ఆశించిన స్థాయిలోనే బస్సులున్నాయి. అయితే వరుసగా రావడం లేదా మధ్యలో సమయం తీసుకోవడంతో ఆటోలు బస్టాండ్లోకి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్నాయి. ఇది చాలా కాలంగా జరుగుతున్నా, ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా ఉదయం వేళ ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుంది. ఆ సమయంలో ఆటోల బెడద ఎక్కువగా ఉంది. ఫలితంగా ఆర్టీసీకి రావాల్సిన ఆదాయాన్ని ఆటో డ్రైవర్లు కొల్లగొడుతున్నారు.



ఆర్టీసీ బస్సుకు అడ్డంగా ఆటో

కానరాని లోడర్

బస్టాండ్‌లో ఆర్టీసీకి సంబంధించిన లోడర్ ఉంటే ఆటోలకు కొంతవరకు క్లొమేసేందుకు అవకాశం ఉంటుంది. గతంలో లోడర్ ఉండేవారు. ఆటోలను బస్టాండ్‌లోకి రానీయకుండా ప్రయాణికులను నిలువరించి ఆర్టీసీ బస్సులను ఎక్కించేవారు. అయితే ప్రస్తుతం లోడర్ లేకపోవడంతో ఆటోలు విచ్చలవిడిగా వచ్చి ప్రయాణికులను ఎక్కించుకెళ్తున్నాయి.



బస్టాండ్‌లో ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకుంటున్న డ్రైవర్లు

అధిక ధరలకు ఎరువుల విక్రయాలు

విడవలూరు: మండలంలో కొందరు డీలర్లు ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి అన్నారు. విడవలూరులోని తన నివాసంలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎరువుల దుకాణాల్లో విక్రయించే యూరియా, డీఏపీ వంటి ఇతరు ఎరువులు చిన్న, సన్నకారులు రైతులకు అందడం లేదని, కొందరికి అందినా అధిక ధరలకు విక్రయిస్తున్నారని, తప్పని పరిస్థితుల్లో విధిలేక రైతులు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా పురుగు మందులు, కలుపునకు సంబంధిన మందులే కాకుండా ఇతర మందులు కూడా నకిలీని విక్రయిస్తున్నారన్నారు. వారి వ్యాపారాల కోసం రైతులు అడిగిన మందులు కాకుండా ఊరూ పేరూలేని నకిలీ మందులను ఇస్తున్నారన్నారు. అంతేకాకుండా ఒక మందు అడిగితే మరో రెండు మందులను కూడా కలిపి వాడాలంటూ రైతులతో వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయాధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న షాపులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

వేడుకగా ‘శతమానం భవతి’

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ‘శతమానం భవతి’ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ నెలలో జన్మించిన అసోసియేషన్ సభ్యులను సన్మానించి, ఆశీర్వచన పత్రాన్ని అందజేశారు. తొలుత కేక్ కట్ చేశారు. అనంతరం వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత ఏడు నెలలుగా క్రమం తప్పకుండా శతమానం భవతిని వేడుకగా నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కిలారి శ్రీనివాసులునాయుడు, గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, నసీర్‌అహ్మద్, బి.సదానందరెడ్డి, వి.ఆదినారాయణరెడ్డి, ఎం.సురేష్, వై.శ్రీనివాసులురెడ్డి, కె.వెంకటరమణ, ఎం.రాజేంద్రప్రసాద్, పీవీ మోహన్‌రెడ్డి, జి.వెంకటేశ్వర్లునాయుడు, మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



నిస్సహాయ వర్గాల సంక్షేమానికి కృషి

నెల్లూరు(బృందావనం): సమాజంలో అనేక సమస్యలతో సతమతమవుతున్న నిస్సహాయ వర్గాల సంక్షేమం కోసం నెల్లూరు జిల్లా సేవా సంస్థల సమాఖ్య (ఎన్‌ఎస్‌ఎస్) తన వంతు కృషి చేస్తుందని సమాఖ్య నిర్వాహకులు తెలిపారు. చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డు ఆదిత్యనగర్‌లోని ఐఎంఎం ఆఫీస్‌లో ఆదివారం వివిధ సేవా సంస్థల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడిబయట పిల్లలు, బాలకార్మికులు, నిరాదరణకు గురైన వృద్ధులు, దివ్యాంగులు, హెచ్‌ఐవీ బాధితులు, ఒంటరి మహిళలు, వ్యవసాయ కార్మికులు తదితర నిస్సహాయ వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయనుందన్నారు. జిల్లాలోని స్వచ్ఛంద సేవా సంస్థలను ఒకేతాటిపై తెచ్చేందుకు ‘నెల్లూరు జిల్లా సేవా సంస్థల సమాఖ్య’ను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమాఖ్య సమావేశం ఈనెల 28వ తేదీన ఉదయం 10 గంటలకు ఏసీ స్టేడియం దగ్గర ఉన్న అంబేడ్కర్ భవనంలో జరుగనుందన్నారు. జిల్లాలోని స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు హాజరై జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సమాఖ్య కన్వీనర్స్ ఈ.శ్రీనివాసరావు, బాలచెన్నయ్య, కేఎస్‌ఎస్ బాబా, చిట్టిబాబు, విజయబాబు, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాయిని



విక్రయానికి ఉంచిన అల్లనేరేడు పండ్లు

- అల్లనేరేడులో అనేక ఔషధ గుణాలు
- దీర్ఘకాలిక వ్యాధుల వారికి ఎంతో ఉపయోగం



కోవూరు : ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి సిద్ధంగా లభించే పండ్లు, కూరగాయలను సీజన్ల వారీగా తినాల్సిందే. అయితే ప్రకృతి ప్రసాదించే పండ్లలో అల్లనేరేడు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుంది. ఇది శరీరంలో ఏర్పడే అనేక రుగ్మతలను దూరం చేసి చలువను ఇస్తాయి. నేరేడు పండు మాత్రమే కాకుండా చెట్టు ఆకులు, బెరడు కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. మధుమేహం, గుండె సంబంధ వ్యాధులు, కాలానుగుణంగా వచ్చే వ్యాధులను అరికట్టడంలో ఎంతో కీలకంగా ఉంటాయి.

రోజుకు ఒకటి తింటే వ్యాధులు దూరం

నేరేడు పండ్లు కోయడం చాలా శ్రమతో కూడుకున్న పని. దీనివల్ల కేజీ రూ.300 నుంచి రూ.250 పలుకుతోంది. అందులో నాణ్యమైన నేరేడు పండ్లను వేరు చేసి ఇంకా లాభసాటి ధరకు విక్రయిస్తారు. ప్రస్తుత సీజన్‌లో రోజుకు ఒక్కటి చొప్పున నేరేడు పండు తింటే వ్యాధులు దూరమవుతాయని వైద్యులు చెబుతున్నారు. వర్షాకాల ప్రారంభ సమయంలో మాత్రమే అరుదుగా దొరికే అల్ల నేరేడును తరచుగా తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇవి మూత్ర సమస్యల నియంత్రణతో పాటు మధుమేహం అదుపులో ఉంటుంది. కిడ్నీలను శుభ్రపరుస్తాయి. మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లను తగ్గిస్తాయి. కాలేయాన్ని శుభ్రపరిచి పనితీరును మెరుగుపరుస్తుంది. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండె, మెదడుకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. దంతాలు, చిగుళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోట్లోని చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది. కడుపులో పేరుకుపోయిన మలినాలను బయటకు పోవడానికి సహకరిస్తాయి. నేరేడు పండ్లలో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో అనేక రుగ్మతలను నివారిస్తాయి. సంపూర్ణ ఆరోగ్యానికి నేరేడు పండు భరోసా కల్పిస్తుంది. ఈ పండ్లకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. మండల కేంద్రమైన కోవూరులో పండ్ల దుకాణాల వద్ద, బండ్లపై నేరేడు పండ్లను విక్రయిస్తున్నారు.

ఎన్నో ఉపయోగాలు

అల్లనేరేడు పండు శరీరానికి ఎంతో మంచిది. వీటితో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. వీటిని నానబెట్టి ఆ నీరు తీసుకుంటే అజీర్తి, అతిసార, కలరా వ్యాధులు తగ్గుతాయి. కాలానుగుణంగా వచ్చే పండ్లను తింటుండాలి. అన్ని వయస్సుల వారు వీటిని తినవచ్చు.

– వెంకటచలపతి, వైద్యుడు, కోవూరు

‘చలో విజయవాడ’ విజయవంతానికి పిలుపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థల్లో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరుతూ ఆగస్టు 8న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యదర్శి సుమన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నూతన షిఫ్ట్ ఆపరేటర్లకు పాత వారితో సమానంగా వేతనాలు ఇవ్వాలని, మీటర్ రీడర్స్, స్టోర్ హమాలీలు, బిల్ కలెక్షన్ ఏజెంట్లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలంటూ చలో విజయవాడ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం

నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ సమీపంలోని రాజీవ్ గృహకల్ప నివాసాలు పూర్తిగా పాడైపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నిర్మించిన గృహాల్లో పేదలు నివాసం ఉంటున్నారు. అయితే అప్పటి నుంచి ఎలాంటి నిర్వహణ చేయకపోవడంతో చాలా చోట్ల భవనాలు పెచ్చులూడిపోయింది. బిల్డింగ్ పైభాగంలో, ట్యాంకుల వద్ద పిచ్చి మొక్కలు మొలిచి చెట్లుగా మారుతున్నాయి. రానున్న వర్షాకాలం నేపథ్యంలో అధికారులు తగిన పర్యవేక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



కిటికీల వెంబడి ఏపుగా పెరుగుతున్న చెట్లు



పెచ్చులూడుతూ..



కూలేందుకు సిద్ధంగా..



బిల్డింగ్ పైభాగంలో పెరుగుతున్న మొక్కలు